## క్లుప్తంగా

### ట్రాక్టర్ అడ్డుపెట్టి నిరసన



**దంతాలపల్లి:** మండలంలోని రామవరం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్యానాయక్ ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో నిరసన సెగ తగిలింది. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తమ గ్రామాన్ని ఏం అభివృద్ధి చేశావని, ట్రాక్టర్ అడ్డుపెట్టి గ్రామానికి రాకుండా గ్రామస్తులు నిరసన తెలిపారు.

### నాయకుల విస్తృత ప్రచారం

**సాక్షి నెట్‌వర్క్:** బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పని చేయాలని మహబూబాబాద్ ఎంపీ మాళోత్ కవిత కోరారు. నర్సింహులపేట మండంలోని పలు గ్రామాల్లో రెడ్యానాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో సర్పంచ్ నల్లాని నవీన్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

**కాంగ్రెస్..**

మరిపెడ మండలంలోని పలు గ్రామాల్లో డోర్నకల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ప్రచారం నిర్వహించారు. మహబూబాబాద్ మండలంలోని పలు తండాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ విస్తృత ప్రచారం నిర్వహించాడు.

**బీజేపీ..**

గూడూరు మండలంలోని రాములుతండా, చిర్రకుంటతండా, సాంబయ్యపల్లి, గాజుల గట్టు, గుండెంగ గ్రామాల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్‌నాయక్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించాడు.

# సంక్షేమ పథకాలు చూసి ఓటేయండి



మహబూబాబాద్: ప్రచారంలో పాల్గొన్న శంకర్‌నాయక్



మహబూబాబాద్ అర్బన్: మిర్చి తొడిమె తీస్తున్న శంకర్‌నాయక్

- ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్

**మహబూబాబాద్:** బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ ఓటర్లను కోరారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 12,13,14 వార్డుల్లో సోమవారం శంకర్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. మానుకోట మున్సిపాలిటీలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపు రేఖలు మారాయన్నారు. సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు విడుదల చేయగా వాటితో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. పలు కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కౌన్సిలర్ మార్నెని వెంకన్న , చిట్యాల జనార్దన్ నాయకులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని 15, 16 వార్డుల్లో శంకర్ నాయక్ ప్రచారం చేస్తున్న క్రమంలో ఓ వృద్ధురాలిని సీఎం కేసీఆర్ అందిస్తున్న పెన్షన్, సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకుని, అవ్వతో కలిసి మిర్చి తొడిమెలు తీశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అవ్వని కోరారు.

**బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి**

**కేసముద్రం:** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, నీలం దుర్గేష్, రావుల రవీచందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ నారాయణరావుకు ఘన నివాళి



మహబూబాబాద్ అర్బన్: కాళోజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

**మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్ రూరల్ /నెల్లికుదురు:** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి, గౌరవ ముఖ్య సలహాదారులు మైన నాగయ్య, సంఘ కోశాధికారి పట్టాభి లక్ష్మయ్య పాల్గొన్నారు. మహబూబాబాద్ రూరల్ మండలంలోని అమనగల్ ప్రభుత్వ పాఠశాలల్లో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు గుగులోత్, క్లెం వెంకట్ రెడి, సత్య శంకర్ పాల్గొన్నారు. నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కవిరాజ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

**గూడూరు:** మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఆదివాసీ గిరిజన విద్యార్థిని కుసుమాంజలి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ చదివించగా, కుసుమాంజలి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఆమె విషయం తెల్సుకున్న గూడూరుకు చెందిన పదో తరగతి 1998–99 మిత్రులతోపాటు మండలంలోని పలువురు ఉద్యోగుల ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఖర్చుల నిమిత్తం రూ. లక్ష 15 వేలు జమచేసి అందించారు.

### సమస్యలు పరిష్కరించాలి

**కురవి:** పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. సోమవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

# దౌర్జన్యాలు, దాడులు మానుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్

**మహబూబాబాద్ అర్బన్/నెల్లికుదురు:** సిర్పూర్ కాగజ్‌నగర్ కోనేరు కోనప్ప అనుచరులు, గుండాలు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై దౌర్జన్యాలు దాడులను చేయడం మానుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇసంపెల్లి ఉపేందర్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ప్రవీణ్ కుమార్‌పై దాడులకు ప్రయత్నించడం బీఆర్ఎస్ గుండా రాజకీయానికి తెర లేపుతున్నారని, బీఎస్పీ కార్యకర్తలను బెదిరించడం బీఆర్ఎస్ పార్టీ పతనాన్ని జీర్ణించుకోలేక దాడులకు పాల్పడుతున్నారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శేఖర్ నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ ప్రసాదరావు, జిల్లా కోశాధికారి లక్ష్మ ణ్, జిల్లా ఈసీ సభ్యుడు చాణక్య, నాయకులు నరేష్, విష్ణు, సాగర్ పాల్గొన్నారు.

# సీఎం సభకు భారీ ఏర్పాట్లు



తొర్రూరులో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు



కొడకండ్ల : సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- నేడు తొర్రూరులో బీఆర్ఎస్ ఆశీర్వాద సభ
- భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపు
- పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**తొర్రూరు :** శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేడు (మంగళవారం) తొర్రూరులో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు పట్టణ శివారు మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తొర్రూరు శివారు మహబూబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన సభ కోసం వేదిక, వాటర్ ప్రూఫ్, 50 మంది ఆసీనులయ్యేలా వేదికను సిద్ధం చేశారు. కళాబృందాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే జరిగే అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను సీఎం ప్రజలకు వివరించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సభ జరగనుంది. పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం సభను దృష్టిలో పెట్టుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గ్యారంటీ, వారంటీ లేని పథకాలతో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అర్రులు చాస్తోందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. రైతుబంధు, బీమా ఆపాలని కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం రైతులను మోసగించడమేనన్నారు. సభా ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, డాక్టర్ పి.సోమేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ కృషిని చాటాలి**

**దేవరుప్పుల :** తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్లో చాటాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరులో నేటి కేసీఆర్ సభకు నిర్దేశిత జనం కంటే అధికంగా తరలించేలా పార్టీ నాయకులు పాటుపడాలన్నారు. ధరావత్‌తండా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కొత్త జలంధర్‌రెడ్డి, సర్పంచ్ గేమానాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో ఎంపీపీ బస్వసావిత్రిమల్లేశం, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ మండల అధ్యక్షుడు రామ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి చింత రవి, చామల విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సభను విజయవంతం చేయాలి**

**పాలకుర్తి:** ఎన్నికల ప్రచారంలో భాగంగా తొర్రూరు తహల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత మరింత అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

**పెద్దవంగర:** తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన సీఎం కేసీఆర్ సభకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని చెప్పారు. అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దని, వారితో జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పుసులేటి వెంకటరామయ్య, కాసాని హరీశ్, ఎర్సాని రామ్మూర్తి, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

**అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా..**

**కొడకండ్ల :** తొర్రూరులో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, అండగా నిలిచి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజలను అవమానిస్తే పాతరపెడదాం..**

**రాయపర్తి :** పాలకుర్తి ప్రజలను అవమానించిన కాంగ్రెస్‌ను పాతరపెడదామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక కుందూరు కృష్ణారెడ్డి దొడ్డిలో తొర్రూరులో నిర్వహించే సీఎం కేసీఆర్ సభ కోసం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తి సభలో దళితులను అవమానిస్తూ కాలుతో తన్నిన రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేలా సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇవ్వాల ఇక్కడ రేపు ఎక్కడో తెలియని వాళ్లకు ఓటు వేద్దామా అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

**దయాకర్‌రావు గెలవాలని పూజలు**

పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లక్ష ఓట్ల మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని శివరామపురం దుర్గమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలను కొట్టి పూజ చేశారు. గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు కడెం లక్ష్మీవెంకటయ్య దంపతులు దయాకర్‌రావుపై అభిమానంతో కొబ్బరికాయలను దుర్గమ్మ దేవతకు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ అనిమిరెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

మండలంలోని జయరాంతండా(కె)కు చెందిన బీ జేపీ యూత్ నాయకులు సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు.

# కాంగ్రెస్‌తోనే రైతురాజ్యం సాధ్యం



ఇల్లెందు: సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి కనకయ్య, పక్కన నాయకులు



గార్ల: పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న కనకయ్య

**ఇల్లెందు/టేకులపల్లి:** రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య తెలిపారు. టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముందే హామీ ఇచ్చినట్లు ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. కాగా, ఉచిత విద్యుత్ విషయంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రకటనలను నమ్మొద్దని కోరారు. సుపరిపాలన కోసం ప్రతీఒక్కరు చేయి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కాగా, ఇల్లెందులో జరిగిన సమావేశంలో వైఎస్సార్ టీపీ నాయకురాలు బానోతు సుజాత మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవద్దనే భావనతోనే తమ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఈ ఎన్నికల్లో పోటీ చేయొద్దని నిర్ణయించారని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య విజయానికి పాటుపడతామని చెప్పారు. ఈసమావేశంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డానియేల్, సైదులు, కున్సోత్ రాము, వీరబాబు, శివ, మేకల రాజేశ్, భాను, సత్తిరెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి**

**బయ్యారం/గార్ల:** ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య పిలుపునిచ్చారు. బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఈసందర్భంగా కనయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మాటలను ప్రజలను నమ్మే స్థితిలో లేరని, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఇక గార్ల మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఆదాయ పన్ను శాఖ అధికారి గంగావత్ రాంసింగ్ తన అనుచరులతో కలిసి కనకయ్య సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. తొలుత పలు గ్రామాల్లో కనకయ్య రోడ్‌షో ద్వారా ప్రచారం నిర్వహించారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ శోభ, వార్డు సభ్యులు గాజుల శ్రీను, హరిప్రసాద్, కవిత ఉండగా, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి తోపాటు వడ్లమూడి దుర్గాప్రసాద్, అజ్మీరా బన్సీలాల్, వెంకట్‌లాల్, రామారావు పాల్గొన్నారు.

# వైభవంగా దీపావళి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: బాణసంచా కాలుస్తున్న పట్టణవాసులు

శ్రీమహావిష్ణువు అవతారాల్లో ఒకటైన శ్రీకృష్ణుడి అవతారంలో సత్యభామా సమేతుడై శ్రీకృష్ణభగవానుడు లోకకల్యాణార్థం నరకాసురుడిని సంహరించి భక్తులకు అందించిన దీపావళి పండుగను ఆది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఇంటిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం సాయంత్రం కుటుంబ సమేతంగా టపాసులు కాల్చారు.

– సాక్షి నెట్‌వర్క్

### గొడవకు దారితీసిన ప్రచారం

**నర్సింహులపేట:** డోర్నకల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ, బీజేపీ నాయకుల పోటాపోటీ ప్రచారం గొడవలకు దారితీసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని గోపాతండా గ్రామ పంచాయతీ శివారు లావుడ్య తండాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ వస్తుండగా, అక్కడనే ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి భూక్య సంగీత రోడ్డుపై పాటకు డ్యాన్స్ చేస్తూ ఉండటంతో ఎదురుగా వచ్చిన బీఆర్ఎస్ నాయకులు అడ్డుగా ఉన్నారని పక్కకు వెళ్లాలని చెప్పడంతో గలాటా మొదలై ఒకరిపై ఒకరు దాడికి చేసుకున్నారు.

# ఆడబిడ్డను ఆదరించి గెలిపించాలి



టేకులపల్లి: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ



ఇల్లెందు: మాట్లాడుతున్న హరిప్రియ, పక్కన వెంకట్‌గౌడ్, రమ

**టేకులపల్లి:** రూ.కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశానని, ఈ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి ఇంటింటి ఆడబిడ్డగా అయిన తనను గెలిపించి ఆశీర్వదించాలని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ కోరారు. టేకులపల్లి మండలంలోని రామచంద్రునిపేట, బోడు, మొక్కంపాడు, ఎర్రాయిగూడెం, పెట్రాంచెలక, బద్దుతండాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యాన అమలుచేస్తున్న పథకాలతో పాటు మూడోసారి అధికారంలోకి రాగానే అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధిని చూసి ఓటువేయాలని కోరారు. అనంతరం పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి హరిప్రియ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా పెట్రాంచెలక స్టేజీకి హరిప్రియ, నాయకులు వెళ్లగా స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, దళపతి శ్రీనివాస్‌రాజు, కంభంపాటి చంద్రశేఖర్, శివకృష్ణ, బాలు పాల్గొన్నారు.

**గెలుపు తథ్యం..**

**ఇల్లెందు:** బీఆర్ఎస్‌లోకి మాజీ మున్సిపల్ చైర్మన్ మడత రమ – వెంకట్‌గౌడ్ దంపతులు రావడంతో తన గెలుపు ఖాయమైపోయిందని బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ పేర్కొన్నారు. ఇల్లెందు పట్టణం సీతారామా ఏరియా పరిధిలోని వారి నివాసానికి వెళ్లిన హరిప్రియను మడత దంపతులు ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బలమైన నాయకత్వ లక్షణాలు కలిగిన వెంకట్ దంపతులు బీఆర్ఎస్‌లోకి రావడం ఎంతో హర్షణీయమని తెలిపారు. ఇటీవల కొందరు పార్టీకి వెన్నుపోటు పొడిచినా వీరి రాకతో ఆ లోటు తీరిందని హరిప్రియ వెల్లడించారు.

## క్రైం కార్నర్..

**వ్యక్తి ఆత్మహత్యాయత్నం**

**కురవి:** పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బాతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సంఘటన సీరోలు మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన తేజావత్ సందీప్, నీలా అనే మహిళతో పాత గొడవలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం నీలా ఖమ్మం వెళ్లి వేరే వ్యక్తి ద్విచక్రవాహనంపై లిఫ్ట్ అడిగి తండాకు వెళ్తోంది. చూసిన సందీప్ నీలాకు ఎందుకు లిఫ్ట్ ఇచ్చావని లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తితో గొడవపడ్డాడు. గొడవ విషయం నీలా భర్త తెలుసుకుని సందీప్‌తో గొడవ పడ్డాడు. వెంటనే సీరోలు పోలీస్ స్టేషన్‌లో సందీప్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో సందీప్ పురుగుల మందు తాగి డబ్బాతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు సందీప్ వద్ద ఉన్న డబ్బాను లాక్కొని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయమై సీరోలు ఎస్సై రమాదేవిని వివరణ కోరగా.. సందీప్ అనే వ్యక్తి ఓ అమ్మాయితో గొడవలు పడ్డాడని, ఆమె ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పోలీస్ కేసు అవుతుందనే భయంతో సందీప్ ఆదివారం కాంపల్లిలో పురుగుల మందు తాగి స్టేషన్‌కు ఆస్పత్రికి తరలించినట్లు ఆమె పేర్కొన్నారు.

**పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య**

**కురవి:** పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘన కురవి మండలం బలపాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కురవి ఎస్సై గోపి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. బలపాల గ్రామానికి చెందిన రొయ్యల వెంకటేష్(29) అనే వ్యక్తి సోమవారం ఇంటి వద్ద పురుగుల మందు(గడ్డిమందు) తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపాడు.

**ముగ్గురిపై కేసు నమోదు**

**గూడూరు:** మండలంలోని అయోధ్యపురం వద్ద ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ కారును అడ్డుకున్న కేసులో సోమవారం ముగ్గురుపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు. వివరాల ప్రకారం బానోతు శంకర్‌నాయక్ పది రోజుల క్రితం మృతిచెందిన పానుగోడు గ్రామానికి చెందిన సర్పంచ్ నలమాస వెంకన్నగౌడ్ దశదిన కర్మకు కారులో వెళ్లి వస్తున్నారు. అయోధ్యపురం శివారులోకి రాగా ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో కారును ఆపి విధులకు ఆటంకం కల్గించారు. ఎమ్మెల్యే అభ్యర్థి గన్‌మెన్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

**గార్లలో..**

**గార్ల:** మండలంలోని మద్దివంచ గ్రామానికి చెందిన గుండ్ల ఉమ ఇంటిపై పోలీసులు దాడి చేసి 10లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపారు.

**డీసీఎం వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం**

**వరంగల్ క్రైం:** సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డు నీలిమా జంక్షన్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం, గున్నెపల్లి గ్రామానికి చెందిన చిల్లా సిద్ధార్థ (21) విశాల్‌మార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి విధులు ముగించుకొని అదాలత్ వైపు వస్తుండగా విష్ణుప్రియ గార్డెన్‌కు వైపు వెళుతున్న డీసీఎం వ్యాన్ అతన్ని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బైక్‌పై ఉన్న మరో ఇద్దరు గుగులోతు పవన్, ప్రమోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి చిల్ల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.